సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ; 28 ; జూలై ; 2023






**అవగాహన ఉండాలి**

ఓటు హక్కు వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ వెంకటమాధవరావు అన్నారు. 8లో▸

**భారీ కుదుపు**

హెచ్‌ఎండీఏలో కీలకమైన ప్రణాళికా విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. 8లో▸



**అత్యవసర పరిస్థితుల్లో..**

వర్షాలకు ఇళ్ల నుంచి ఎవరూ బయటకు వెళ్లకూడదని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి సూచించారు. 8లో▸


## న్యూస్‌రీల్

### అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలి



ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీజీ రాజబాబు

**పహాడీషరీఫ్:** భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలని క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల డైరెక్టర్ జనరల్ యు.రాజబాబు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పహాడీషరీఫ్‌లోని ఆర్‌సీఐలో గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌సీఐలో కలాం తిరిగిన ప్రదేశాన్ని ఆయన గౌరవార్థం 'విజ్ఞాన భూమి'గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి నైతిక విలువలు పాటించాలని, నిబద్ధతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఐ డైరెక్టర్ అనింద్య బిశ్వాస్, చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ జీడీజీ ప్రసాద్ రాజు, ఎస్టేట్ మేనేజర్ షేక్ గౌస్ మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటి సర్వే భేష్

**ఆరోగ్యశాఖప్రతినిధి డాక్టర్ పంకజ్**



ఇంటింటి సర్వేను పరిశీలించిన వైద్యాధికారులు

**చేవెళ్ల:** ప్రజల ఆరోగ్య సంరక్షణకు టీకాలు వేసే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం కోసం చేపడుతున్న ఇంటింటి సర్వే నిర్వహణ బాగుందని ఢిల్లీ నుంచి వచ్చిన ఆరోగ్యశాఖ ప్రతినిధి డాక్టర్ పంకజ్ అన్నారు. మండలంలోని కమ్మెట ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో జరుగుతున్న సర్వేను డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు స్వర్ణకుమారి, దామోదర్, రాజ్‌కుమార్, అనిల్ కుమార్ తదితరులతో కలిసి గురువారం పర్యవేక్షించారు. మంచి టీమ్‌వర్క్‌తో సర్వే చేస్తున్నారని సిబ్బందిని అభినందించారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలో సర్వేను పక్కగా చేపట్టాలని సూచించారు. వారి వెంట చేవెళ్ల డివిజన్ ఆరోగ్య వైద్య విద్య విస్తరణ అధికారి సుదర్శన్, సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ జోత్స్న, సిబ్బంది ఉన్నారు.

### పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 22 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే కనీసం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. తక్కువ జీతాలతో బానిసలుగాపని చేయించుకుంటున్నారని మండిపడ్డారు. అనంతరం డీపీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

### చెరువులు, కుంటలను కాపాడాలి

**ఇబ్రహీంపట్నంరూరల్:** కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వలలు, తెప్పలతో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులకు 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల వాహనాలు, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ వృత్తి పరికరాలు ఇవ్వాలని అన్నారు. ఉచిత చేపపిల్లలు వద్దని, మత్స్య సొసైటీల్లో నగదు జమ చేయాలని, ప్రతి మత్స్యకారుడికి వ్యక్తిగతంగా రూ.5 లక్షలు, ప్రతి సొసైటీకి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, సహాయ కార్యదర్శి బోద్రమోని నర్సింహ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: అపిల్ అవెన్యూ కాలనీలో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



శంకర్‌పల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు



చేవెళ్ల : దేవరంపల్లి వద్ద ఈసీ వాగు ఉధృతి

# వానొచ్చె.. వరదొచ్చె

వరుణుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు.. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జలాశయాలు పోటెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో మునిగిపోయాయి. వరదలతో జలాశయాలు, చెరువులు, కుంటలు పొంగి పరీవాహక ప్రాంతాల్లోని కాలనీలు నీటమునిగాయి. రహదారులు జలమయం అవుతున్నాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల శిథిలావస్థకు చేరిన ఇళ్లు నేలమట్టం అవుతున్నాయి. జనజీవనం స్తంభించిపోతోంది.




అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్-లష్కర్ గూడ మార్గంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు



తుర్కయంజాల్: కాలువలో చేపలు పడుతున్న స్థానికులు



ఆమనగల్లు: మాడ్గుల మండలం సుద్దపల్లి వాగువద్ద నిలిచిపోయిన రాకపోకలు



ఇబ్రహీంపట్నం: లక్ష్మీనగర్ కాలనీలోకి చేరిన పెద్ద చెరువు బ్యాక్ వాటర్



మొయినాబాద్: హిమాయత్‌నగర్ చౌరాస్తా వద్ద డ్రైనేజీ కోసం తీసిన గుంతలో దిగబడిన కారు



మొయినాబాద్‌రూరల్: నీట మునిగిన గులాబీతోట



కొందుర్గు: దెబ్బతిన్న టమాట పంట



మహేశ్వరం: దబిల్‌గూడలో వర్షానికి కూలిన ఇల్లు



షాబాద్: పటేల్‌గూడలో కూలిన ఇల్లు

# ర్యాంకుల వేట

**స్వచ్ఛ సర్వేక్షణ్ పతకాలకు పోటీ పడుతున్న మున్సిపాలిటీలు**

- ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న సిబ్బంది

**తుక్కుగూడ:** స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల వేటలో మున్సిపాలిటీలు పోటీ పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 పోటీల్లో ముందు వరసలో నిలిచేందుకు సిద్ధమవుతున్నాయి. పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.. ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ చేపట్టారు. త్వరలో మున్సిపల్ కేంద్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించి అవార్డులకు ఎంపిక చేయనున్న ఈ నేపథ్యంలో సిబ్బంది ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ.. ర్యాంకులు సాధించడం కోసం ప్రజల అభిప్రాయాలను నమోదు చేస్తున్నారు. మున్సిపల్ బిల్ కలెక్టర్, మెప్మా రిసోర్స్ పర్సన్లు సర్వేలో పాల్గొంటున్నారు.

**రోజుకు 50 మంది లక్ష్యం**

రోజుకు కనీసం 50 మందితో సర్వే నిర్వహించాలని లక్ష్యం ఉండడంతో ఇంటింటికీ వెళ్లి యజమాని స్మార్ట్ ఫోన్‌తో స్వచ్ఛ సర్వేక్షణ్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి సర్వేలోని ఏడు ప్రశ్నలకు సమాధానం రాబడుతున్నారు. ఈ సర్వే ఆగస్టు 16వ తేదీ వరకు కొనసాగనుంది. ఆ తర్వాత మున్సిపాలిటీల వారీగా ర్యాంకులను కేటాయించి వారికి స్వచ్ఛ సర్వేక్షణ్–2023 అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది.

**అవార్డులతో అధిక నిధులు**

స్వచ్ఛ సర్వేక్షణ్ – 2022లో ఉత్తమ ర్యాంకు సాధించిన జిల్లాలోని ఆదిబట్ల, బండగ్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.2 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చెత్త సేకరించేందుకు వాహనాల కొనుగోలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, ప్రధాన కూడళ్లలో తడి, పొడి చెత్త బాక్సుల ఏర్పాటు వంటి వాటికి కేటాయించారు.



తుక్కుగూడలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

**సర్వేలోని అంశాలు ఇవే..**

- మీ ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరిస్తున్నారా ?
- మీ ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేస్తున్నారా?
- మీ ఇంటి పరిసరాల్లో మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉన్నాయా?
- రెడ్యూస్ రియూస్ రీసైక్లింగ్ సెంటర్ గురించి మీకు తెలుసా?
- కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా?
- మీ పరిసరాల్లో పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు?
- మీ పట్టణంలో పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు?

**మున్సిపాలిటీల వారీగా ఇప్పటి వరకు అభిప్రాయ సేకరణ ఇలా..**

| | |
|---|---|
| ఇబ్రహీంపట్నం | 278 |
| ఆదిబట్ల | 1,060 |
| ఆమనగల్లు | 738 |
| బడంగ్‌పేట | 200 |
| జల్‌పల్లి | 435 |
| తుక్కుగూడ | 2,820 |
| తుర్కయంజాల్ | 1,102 |
| మీర్‌పేట | 144 |
| పెద్దఅంబర్‌పేట | 1,147 |
| నార్సింగ్ | 4,302 |
| షాద్‌నగర్ | 3,108 |
| శంషాబాద్ | 3,615 |
| శంకర్‌పల్లి | 975 |
| కొత్తూరు | 902 |
| మణికొండ | 1,072 |

**ఆదర్శ మున్సిపాలిటీకి కృషి**



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లాలోనే తుక్కుగూడను ఆదర్శ మున్సిపాలిటీగా నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు భాగస్వాములై స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలి. సంపూర్ణ పారిశుద్ధ్యం కోసం ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

– వెంకట్రామ్, మున్సిపల్ కమిషనర్, తుక్కుగూడ

# వరదనీరు సాఫీగా వెళ్లేలా చూడండి



మంత్రాల చెరువు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి

**మీర్‌పేట:** వరదనీరు నిల్వకుండా సజావుగా వెళ్లేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు మంత్రాల చెరువులో చేరుతున్నందున నేరుగా ట్రంక్‌లైన్ నుంచి వెళ్లేలా అధికారులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చందన చెరువు వద్ద ఆర్‌సీఐ రహదారిపై వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వరదనీరు లేకుండా చూడాలని, కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా ముంపు సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు, స్థానిక నాయకులంతా అప్రమత్తమై ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మంత్రి వెంట మేయర్ ఎం. దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ వాణి, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# రైతు రాజ్యం బీజేపీతోనే సాధ్యం

**బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్**

**షాద్‌నగర్:** రైతు రాజ్యం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసిన కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని గణేశ్ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణంలో పార్టీ నేతలు, రైతులతో కలిసి డిజిటల్ తెరపై వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొంటున్న సీఎం కేసీఆర్ వారి కోసం చేసిందేమీ లేదన్నారు. కేంద్రం అన్నదాతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెడితే తెలంగాణలో పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. రైతుబంధు ఇచ్చి సబ్సిడీలను ఎత్తివేసిందన్నారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పడాలన్నా, పల్లెలు, రైతులు బాగు పడాలన్నా బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, మిథున్‌రెడ్డి, భూపాలచారి, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

# మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్ రూరల్: వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎస్‌ఐ దేవకి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన గుమ్మడి నిర్మలమ్మ(36) ఈ నెల 25న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. భారీ వర్షాల నేపథ్యంలో మూడు రోజులుగా గల్లంతైన మహిళ మృతదేహం దొరకలేదు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చేపట్టిన గాలింపు చర్యలేవీ ఫలితమివ్వలేదు. గురువారం ఉదయం నిర్మలమ్మ మృతదేహం చెట్ల పొదల మధ్య నీటిపై తేలి కనిపించింది. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిర్మలమ్మ తల్లి సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఎస్‌ఐ దేవకి తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ దేవకి

# అత్యవసరమైతేనే బయటకు వెళ్లండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ నారాయణ రెడ్డి

డీసీపీ నారాయణ రెడ్డి

కొందుర్గు: వర్షాలకు ఇళ్ల నుంచి ఎవరూ బయటకు వెళ్లకూడదని శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి సూచించారు. గురువారం డీసీపీ జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పనులకు వెళ్లేవారు వాగులు, వంకలు ప్రవహిస్తున్న సమయంలో దాటేందుకు ప్రయత్నించకూడదన్నారు. సాధ్యమైనంతవరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. చిన్నారులను బయటికి పంపించకూడదని సూచించారు. అలాగే శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండకూడదని హెచ్చరించారు. డీసీపీ వెంట ఏసీపీ రంగస్వామి, సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్‌ఐ సక్రమ్ ఉన్నారు. అదే విధంగా జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎస్‌ఐ సక్రమ్ తూంపల్లి, తుమ్మలపల్లి, చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామాల్లో పర్యటించి వాగులను పరిశీలించారు. వాగుల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. అలాగే కొందుర్గు తహసీల్దార్ రమేశ్ కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, ఎస్‌ఐ కృష్ణయ్య, వెంకిర్యాల, టేకులపల్లి, లాలాపేట, కొందుర్గు వాగులను పరిశీలించారు.

# హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌లో భారీ కుదుపు..

**మార్పులు, చేర్పులతో ప్రక్షాళన**

- ఇద్దరు డైరెక్టర్‌లకు రెండు జోన్‌ల చొప్పున కేటాయింపు
- గతంలో ఒక డైరెక్టర్‌కే మూడు జోన్‌లు..
- ప్రణాళిక విభాగం ఇన్‌చార్జిగా దేవేందర్‌రెడ్డి
- మాస్టర్‌ప్లాన్, జీవో 111తో పాటు మరికొన్ని అదనపు బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో కీలకమైన ప్రణాళికా విభాగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటు చేసుకున్నాయి. డీటీసీపీ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.దేవేందర్‌రెడ్డికి హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. అలాగే హైరైజ్ బిల్డింగ్స్ కమిటీ సభ్య కన్వీనర్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. హెచ్‌ఎండీఏలోని ఇద్దరు డైరెక్టర్ల కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, మాస్టర్‌ప్లాన్, జీవో 111 సంబంధిత అంశాలను కూడా దేవేందర్‌రెడ్డికి అప్పగిస్తూ హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణ పథకాలు, ప్రాజెక్ట్ ఫార్ములేషన్ యూనిట్ అంశాలు వంటివి కూడా దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి. జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీప్లానర్‌గా చాలా ఏళ్లు పని చేసిన ఆయనను కొద్ది రోజుల క్రితమే ప్రభుత్వం డీటీసీపీకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. డీటీసీపీ డైరెక్టర్‌గా ఉన్న కె.విద్యాధర్‌ను హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం డెరెక్టర్–1గా బదిలీ చేశారు. అలాగే ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా, హెచ్‌ఎండీఏ ప్లానింగ్–1 ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బాలకృష్ణను హైదరాబాద్ మెట్రో రైల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. రేరా కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. హెచ్‌ఎండీఏ–2 డైరెక్టర్‌గా ఉన్న జీ. శివశరణప్పను ఎంఏయూడీ ప్లానింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జీహెచ్‌ఎంసీ (హౌసింగ్ మెంబర్) డైరెక్టర్‌గా పని చేస్తున్న కె.శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ప్రస్తుతం వీరి విధుల్లో చాలా వరకు మార్పులు, చేర్పులు జరిగాయి.

**డైరెక్టర్‌ల విధుల్లో మార్పులు..**

మరోవైపు కొత్తగా బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్‌ల విధుల్లో మార్పులు జరిగాయి. విద్యాధర్ పరిధిలో ప్రస్తుతం శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్కేసర్ మూడు జోన్‌లు ఉండగా వాటిని రెండింటికే పరిమితం చేశారు. దీంతో ఆయన పరిధిలో ఘట్కేసర్, మేడ్చల్ జోన్‌లు మాత్రమే ఉంటాయి. అలాగే రెండో డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ పరిధిలో ఇటీవల వరకు మేడ్చల్ జోన్ మాత్రమే ఉండేది. తాజా మార్పుల్లో భాగంగా శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లను శ్రీనివాస్‌కు అప్పగించారు. ఈ జోన్‌లలో ఎల్ఆర్ఎస్, లే అవుట్ పర్మిషన్‌లు, భవన నిర్మాణ అనుమతులు, తదితర అంశాలతో పాటు, హెరిటేజ్ భవనాలు, హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల సుందరీకరణ, తదితర అంశాలను విద్యాధర్ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రాజెక్ట్‌ఫార్ములేషన్ యూనిట్, రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, గ్రిడ్‌రోడ్స్, లింక్‌రోడ్స్, స్లిప్‌రోడ్స్,ప్రణాళికాసంబంధమైన విషయాలు డైరెక్టర్–2 అయిన శ్రీనివాస్ పరిధిలో ఉంటాయి.

**'కొరత' తీరేనా...**

హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నాలుగు జోన్‌లకు నలుగురు ప్లానింగ్ అధికారులు ఉన్నారు. కానీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు, జేపీవోలు, ఇతర అధికారుల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల ఒక్కొక్కరు రెండు జోన్‌లలో విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఒకవైపు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతుండగా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించడంలో సిబ్బంది కొరత కారణంగా తీవ్రమైన జాప్యం జరుగుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్, లే అవుట్ పర్మిషన్‌లు వంటి అనుమతుల్లో క్షేత్ర స్థాయి పర్యవేక్షణ, సకాలంలో ఫైళ్లను పరిష్కరించి అనుమతులు ఇవ్వడంలో కాలయాపన జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతుల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది.

# ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్




శంషాబాద్: దోహా నుంచి నాగ్‌పూర్ బయలుదేరిన విమానం శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం తెల్లవాజామున అత్యవసరంగా దిగింది. ఖతార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన క్యూఆర్ 590విమానం దోహాలోని హమీద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం అర్ధరాత్రి నాగ్‌పూర్‌కు బయలుదేరింది. గురువారం తెల్లవారు జామున నాగ్‌పూర్ విమానాశ్రయంలో విమానం దిగేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అక్కడి ఏటీసీ అధికారులు విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. శంషాబాద్ ఏటీసీ అనుమతినివ్వడంతో విమానాన్ని తెల్లవారుజామున 3.20 శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా దింపారు. విమానంలోని 99 మంది ప్రయాణికులను నోవా టెల్ హోటల్ బస చేయించారు. రాత్రి ఇక్కడి నుంచి నాగ్‌పూర్‌కు బయలుదేరేందుకు ఖతార్ ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసింది.

## బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య

షాద్‌నగర్: వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో చాలా గ్రామాల్లో మట్టి ఇళ్లు కూలిపోతున్నాయని తెలిపారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఆర్థిక సాయంతో పాటు వారికి గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, వాగులు, డ్రైనేజీల వద్దకు ఎవరు వెళ్లకూడదని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

## బాల కార్మికుడికి విముక్తి

ఇబ్రహీంపట్నం రూరల్: బాలుడితో పని చేయించుకుంటున్న యజమానిపై కేసు నమోదు చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. తుర్కంయాజల్‌లోని రాయల్ హార్డ్‌వేర్ దుకాణ యజమాని బాలుడిని పనిలో పెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలుడికి విముక్తి కల్పించి యజమానిపై కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరి పరిస్థితి విషమం
- పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఘటన



మృతి చెందిన అయాన్, గాయపడిన మహి

రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనాలకు అనుమతి లేకున్నా త్వరగా వెళ్లాలన్న ఆతృతలో డివైడర్‌ను ఢీ కొట్టి మృత్యువాత పడ్డాడు. రాజేంద్రనగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన అయాన్(22), మహి(18) నగరంలోని ఓ కాఫీ సెంటర్‌లో పని చేస్తున్నారు. ప్రతి రోజు వారిద్దరూ బైక్‌పై డ్యూటీకి వచ్చి వెళ్లేవారు. గురువారం ఉదయం వారు ఆరాంఘర్ ప్రాంతంలో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఎక్కి మెహదీపట్నం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ 156 పిల్లర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఎగిరి కిందపడ్డ మహి, అయాన్‌ల తీవ్రంగా గాయపడ్డారు. అయాన్ సంఘటనా స్థలంలోనే మృతి చెందగా మహిని వాహనదారులు అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా గుర్తించారు. సంఘటన జరిగిన ప్రాంతం నుంచి వాహనం దాదాపు 30 మీటర్ల దూరం గాలిలో పల్టీలు కొట్టిం. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## నలుగురు జూదరుల అరెస్ట్

మీర్‌పేట: పేకాట ఆడుతున్న నలుగురిని ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ గోవిందుస్వామి కథనం ప్రకారం.. గుర్రంగూడలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ బృందం మీర్‌పేట పోలీసులతో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న అంబటి శేఖర్, తన్నీరు హనుమంతు, అలమాని రామకృష్ణ, మండి అనిల్‌లను అదుపులోకి తీసుకోగా శివాజీ అనే వ్యక్తి పారిపోయాడు. వారి నుంచి రూ. 54,390 నగదు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు: గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని చంద్రాయణపల్లి తండాకు చెందిన జటావత్ బద్య(39) ఆమనగల్లులోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఉదయం విధులు ముగించుకుని కాలినడకన తండాకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బద్యను అదే వాహనంలో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మేడిగడ్డ తండా వద్ద మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని అక్కడి కల్వర్టు వద్ద పడేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి



కేశంపేట: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కొత్తపేటకు చెందిన భిక్షపతి పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఓ గేదె పొలం వద్ద విద్యుత్ తీగను తగిలి మృత్యువాత పడింది. దీని విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు భిక్షపతి తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

# ఓటు హక్కుపై అవగాహన ఉండాలి


ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ వెంకటమాధవరావు

ఆర్డీఓ వెంకట మాధవరావు

షాద్‌నగర్ రూరల్: ఓటు హక్కు వినియోగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ వెంకటమాధవరావు అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ వీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్లు ఈవీఎంల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఓటరు బ్యాలెట్ యూనిట్ ద్వారా ఓటు హక్కును వినియోంచుకుంటారని, వేసిన ఓటు సక్రమంగా పడుతుందా లేదా అనే విషయాన్ని వీవీ ప్యాడ్‌ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ఓటు వేసిన తరువాత తప్పని సరిగా ఓటు యంత్రాలలో శబ్దం వస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, వార్డు సభ్యురాలు విజయలక్ష్మి, గ్రామస్తులు ఆజం, రమేష్, మహిళలు పాల్గొన్నారు.

# చీటింగ్ కేసులో న్యాయవాది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: లియో మెరిడియన్ రిసార్ట్స్ అండ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీని మోసం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన న్యాయవాదిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. లియో మెరిడియన్ సంస్థ పంజగుట్ట కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ సంస్థ రిసార్టు నిర్మాణం, అభివృద్ధి కోసం శామీర్‌పేట మండలం బొమ్మరాస్‌పేట్ పరిసర ప్రాంతాల్లో భూములను కొనుగోలు చేసింది. ఈ భూమిలో కొంతభాగంలో రిసార్ట్ నిర్మించి, మిగిలింది అభివృద్ధి చేసి విక్రయించింది. సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది దామోదర్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా సదరు సంస్థపై తప్పుడు కేసులు పెట్టారు. ఓ దశలో అతను సంస్థ ఎండీని సంప్రదించి, తప్పుడు కేసులు నమోదు చేసినందుకు క్షమాపణలు చెప్పారు. ఆ తర్వాత లియో రిసార్ట్స్‌కు ఆనుకుని ఉన్న రెండు ఎకరాల భూమి అభివృద్ధి చేయాల్సిందిగా దామోదర్‌రెడ్డి కోరడంతో ఎండీ అంగీకరించారు. 2006 నవంబర్ 27న వీరు రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు. దీని కోసం సంస్థ భారీ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టింది. ఒప్పందం ప్రకారం అభివృద్ధి చేసిన తర్వాత మొత్తం స్థలంలో దామోదర్‌రెడ్డి 3500చదరపు గజాలను తీసుకుని మిగిలింది లియో కంపెనీ పేరుతో రిజిస్టర్ చేయాలి. దీనికి విరుద్ధంగా వ్యవహరించడంతో లియో సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో దామోదర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

# 'అసోసియేషన్ కార్డు'తో అసలు పేరు తెలిసింది

- ఈ పంథాలోనే అగ్వోవోను 'గుర్తించిన'అధికారులు
- బెంగళూరు కేంద్రంగా భారీ దందా

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరు కేంద్రంగా వ్యవస్థీకృతంగా డ్రగ్స్ దందా చేస్తూ తెలంగాణ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు (టీ–నాబ్) పట్టుబడిన ముఠా సూత్రధారి అగ్వోవో మూడు నకిలీ పేర్లతో చెలామణి అయ్యాడు. ఇప్పటి వరకు అందరికీ తప్పుడు పేర్లే చెప్పిన ఇతడి అసలు పేరు అధికారులకు ×అసోసియేషన్ కార్డు₹ ద్వారా తెలిసింది. అగ్వోవో తో సహా అరెస్టయిన ముగ్గురు నైజీరియన్లను పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలోనే డ్రగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ త్రయాన్ని అరెస్టు చేసిన సందర్భంలో అధికారులు రూ.కోటి విలువైన కొకై న్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్న విషయం విదితమే.

**మరో పేరుతో పాస్‌పోర్టు, వీసా తయారీ...**

నైజీరియా నుంచి 2011లో మెడికల్ వీసాపై ముంబై వచ్చి, బెంగళూరులో స్థిరపడిన అగ్వోవో మార్క్స్‌వెల్ నబూసి ముందుగా నకిలీ గుర్తింపులు సృష్టించుకున్నాడు. ఏ మాత్రం తన ఉనికి బయటపడనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటూ... తన పాస్‌పోర్టు, వీసాలను స్కాన్ చేసి, ఫొటో షాప్ ద్వారా నకిలీవి తయారు చేశాడు. వాటిలో తన ఫొటోనే ఉంచి పేరు మాత్రం క్వెకు ఎసుమాన్ క్వామేగా మార్చాడు. వీటి ఆధారంగా తొలుత అనేక చోట్ల ఇళ్లను అద్దెకు తీసుకున్నాడు. చివరకు అదిత్య నగర్‌కు మకాం మార్చిన అగ్వోవో ఆ ఇంటి రెంటల్ అగ్రిమెంట్ ఆధారంగా ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నాడు. 2012లో బిజినెస్ వీసాపై ముంబై వచ్చిన ఒకెకో చిగోజా బ్లెస్సింగ్ కొన్నాళ్లు తమిళనాడులోని త్రిపూర్‌లో ఉండి చివరకు గతేడాది ఇతడి వద్దకే చేరాడు. 2021లో స్టూడెంట్ వీసాపై బెంగళూరు వచ్చిన ఇకెమ్ ఆస్టిన్ ఒబాక కూడా వీరితో కలవడంతో అగ్వోవో డ్రగ్ సిండికేట్ ఏర్పాటైంది.

**ప్రతి ఆరు నెలలకు ఇల్లు మారుస్తూ...**

సోషల్‌మీడియాను ఆధారంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తూ, డెడ్ డ్రాప్, సడన్ డెలివరీ విధానాల్లో వాటిని సరఫరా చేస్తున్న అగ్వోవో పోలీసుల నిఘాకు చిక్కకుండా అనేక జాగ్రత్తలు తీసుకున్నాడు. ప్రతి ఆరు నెలలకు తన మకాం మార్చేవాడు. తన పాత ఇంటికి కొత్త ఇంటికి మధ్య కనీసం 20 కిమీ దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకునేవాడు. కొత్తగా బెంగళూరు, ముంబై వస్తున్న నైజీరియన్లను ఆకర్షించి డ్రగ్స్ దందాలోకి దింపాడు. పోలీసులకు చిక్కకుండా వీటిని ఎలా విక్రయించాలి? తమ ఉనికి బయటపడకుండా ఎలా డెలివరీ చేసి రావాలి? తదితర అంశాల్లో వారికి శిక్షణ కూడా ఇచ్చాడు. తాను విక్రయించే డ్రగ్స్‌కు సంబంధించిన డబ్బును పెడ్లర్స్ కోయంబత్తూరులో ఘనా జాతీయుడి పేరుతో తెరిచిన ఖాతాలో వేసేలా చేశాడు. మాదక ద్రవ్యాలు విక్రయించే ప్రతి ఒక్కరూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని సూచించడంతో పాటు అందుకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తానంటూ వారిని ప్రోత్సహించాడు.

**అసోసియేషన్ కార్డుతోనే 'ఆచూకీ'...**

అగ్వోవో డ్రగ్స్ దందా చేస్తూ అరెస్టయిన నైజీరియన్లకు సహకరించడానికి ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేశాడు. అసోసియేషన్ ఆఫ్ నైజీరియన్స్ పేరుతో ఉన్న దీని ఆధీనంలో హెల్ప్ ఫర్ బక్కే అండ్ ఇన్నోసెంట్ అనే వాట్సాప్ గ్రూప్ ఉంది. వివిధ నేరాలు చేస్తూ పట్టుబడిన నైజీరియన్లకు బెయిల్స్ వంటి న్యాయ సహాయం కోసం ఏర్పాటు చేసిన నిధికి దీని ద్వారానే విరాళాలు సేకరిస్తున్నారు. అగ్వోవోను పట్టుకున్నప్పుడు అతగాడు తన పేరు క్వెకు ఎసుమాన్ క్వామేగా అనే చెప్పాడు. టీ–నాబ్ అధికారులూ ఇదే నిజమని భావించారు. అయితే అతడిని తనిఖీ చేస్తున్నప్పుడు జేబులో అసోసియేషన్ గుర్తింపు కార్డు లభించింది. అందులో ఇతడి ఫొటో, అగ్వోవో అనే పేరు ఉండటంతో అనుమానించిన పోలీసులు లోతుగా ఆరా తీయగా అసలు విషయం బయటపెట్టాడు. ఇతడి వ్యవహారాలు పూర్తి స్థాయిలో తేల్చడానికి అధికారులు ఫైనాన్షియల్ ఇన్వెస్టిగేషన్ నిర్వహిస్తున్నారు.